
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
18-6-2026 (Thursday)
MAIN EDITION

## టెలిగ్రామ్ 'కొత్త డార్క్ వెబ్'గా మారింది: కేంద్రం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్ర ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఇది కేవలం సమాచార మార్పిడి కోసం రూపొందించిన యాప్ కాదని, నేరగాళ్లు, సైబర్ మోసగాళ్లు, తీవ్రవాదులకు ఇది సురక్షితమైన స్థావరంగా మారిందని కేంద్రం ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సంచలన ఆరోపణలు చేసింది. టెలిగ్రామ్ ప్రస్తుతం దేశంలో ఒక 'కొత్త డార్క్ వెబ్'లా తయారైందని కేంద్రం పేర్కొంది. నీట్ వంటి కీలక పోటీ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ, వాటిని సర్క్యులేట్ చేయడంలో ఈ యాప్ ఛానెళ్లను దుండగులు విచ్చలవిడిగా వాడుకుంటున్నారని కేంద్రం ఆధారాలతో సహా వివరించింది.

## వెంకీ, అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ప్రారంభం




**అక్షరటుడే, సినిమాడెస్క్:** దగ్గుబాటి వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. గురువారం ప్రముఖ దర్శకుడు రాఘవేంద్ర రావు, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. వెంకటేశ్‌తో అనిల్‌రావిపూడి ఇప్పటికే పలు చిత్రాలు తీసి హిట్ కొట్టిన విషయం తెలిసిందే. తాజాగా వెంకటేశ్, కల్యాణ్ రామ్‌తో సినిమా తీస్తున్నారు. ఇందులో హీరోయిన్లుగా కీర్తి సురేష్, కృతి శెట్టి నటిస్తున్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లోకి తాబేలు




అక్షరటుడే, నేషనల్ డెస్క్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ జీవిగా పేరొందిన 'జోనాథన్' అనే తాబేలును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారికంగా ఐకాన్‌గా ప్రకటించింది. సగటు ఆయుర్దాయం 150 ఏళ్లు మాత్రమే ఉన్న సెషెల్స్ జెయింట్ జాతికి చెందిన ఈ తాబేలు, ప్రస్తుతం 194వ ఏట అడుగుపెట్టింది. భూమిపై జీవించి ఉన్న అత్యంత పురాతన జంతువుగా రికార్డు సృష్టించింది.

## గోడ కూలి ఇద్దరు దుర్మరణం




అక్షరటుడే, మహబూబ్‌నగర్: భారీ వర్షం కురవడంతో గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు దుర్మరణం చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలో వర్షం కురవడంతో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై కూలిపోయింది. దీంతో కారులో ఉన్న సివిల్ ఇంజనీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు.

## 500 కేజీల గంజాయి స్వాధీనం



అక్షరటుడే, హైదరాబాద్ : గంజాయి సరఫరా చేస్తున్న ముఠాలపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. దాదాపు 500 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలో దొరికిన ముఠాల లింక్ ఆధారంగా ఒడిశా వెళ్లిన ఈగల్ ఫోర్స్ టీమ్.. బలిమెల నుంచి జయపూర్ వరకు 80 కిలోమీటర్లు వెంబడించి గంజాయి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుంది.

## దేశంలో ఎల్‌నినో ప్రభావం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సూపర్ ఎల్‌నినోగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. 2015 నాటి పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా వేశారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మధ్య మరియు తూర్పు పసిఫిక్‌లోని చాలా భాగాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలలో వ్యత్యాసాలు 2 డిగ్రీల సెల్సియస్‌ను మించిపోతాయని అంచనా వేశారు. వ్యవసాయం, నీటి వనరులు, మత్స్య పరిశ్రమ, విపత్తు నిర్వహణ వంటి రంగాలపై దీని ప్రభావం ఉంటుంది.


## లాభాలతో ముగిసిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుల్ రన్ కొనసాగుతోంది. గురువారం మార్కెట్ ఒడిదుడుకులకు లోనయినప్పటికీ చివరికి ప్రధాన సూచీలు గ్రీన్ జోన్‌లో నిలిచాయి. దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైంది. కనిష్టాల వద్ద లభించిన కొనుగోళ్ల మద్దతుతో కోలుకుని సెన్సెక్స్ 539 పాయింట్లు, నిఫ్టీ 152 పాయింట్లు పైకి ఎగబాకాయి. చివరికి సెన్సెక్స్ 254 పాయింట్ల లాభంతో 77,409 వద్ద, నిఫ్టీ 82 పాయింట్ల లాభంతో 24,168 వద్ద స్థిరపడ్డాయి.

**పరిపాలనలో వేగాన్ని, పారదర్శకతను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు 'ఈ-క్యాబినెట్' పద్ధతికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అత్యాధునిక సాంకేతికతతో మంత్రుల భేటీలను కాగిత రహితంగా మార్చేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది.**

– అక్షరటుడే, హైదరాబాద్




# డిజిటల్ క్యాబినెట్‌కు ఆమోదం

- మంత్రులకు ట్యాబ్‌ల పంపిణీ
- పేపర్ లెస్‌గా సమావేశాలు

డిజిటల్ క్యాబినెట్ కోసం సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ క్యాబినెట్ విధానాన్ని పరిశీలించి, మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా కొన్ని మార్పులు చేశారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సర్వీసెస్ ఇన్ కార్పొరేటెడ్ తో చర్చలు జరిపి, ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు టీడీటీఎస్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. ప్రాజెక్టు ప్రారంభానికి తొలి విడతగా రూ.20 లక్షల నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది.

### మంత్రులకు ట్యాబ్‌లు..

ఈ విధానంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లు అందించారు. క్యాబినెట్ ఎజెండాలు, ఫైళ్లు, ప్రతిపాదనలు , ప్రభుత్వ నిర్ణయాలన్నీ డిజిటల్ రూపంలోనే ఉంటాయి. మంత్రులు రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా సరే క్యాబినెట్ ఎజెండాలను పరిశీలించే వెసులుబాటు ఉంటుంది. దీనివల్ల సమావేశాలకు ముందు , తర్వాత ఫైళ్ల నిర్వహణ సులభతరం అవుతుంది.

### అత్యున్నత భద్రతా ప్రమాణాలు..

ప్రభుత్వ నిర్ణయాలు అత్యంత రహస్యమైనవి కాబట్టి, భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. సమాచారం లీక్ అవ్వకుండా, సాఫ్ట్‌వేర్ హ్యాక్ కాకుండా ప్రతి మంత్రికీ ప్రత్యేక లాగిన్ ఐడీలు, పాస్ట్‌వర్డ్‌లను కేటాయిస్తారు. పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.



## బీఆర్ఎస్ హయాంలోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్: కేటీఆర్


**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను గురువారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 2023లో కేసీఆర్ నాయకత్వంలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని కేటీఆర్ తెలిపారు.

## జులై 15 నుంచి అమలులోకి వాణిజ్య ఒప్పందం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యునైటెడ్ కింగ్‌డమ్‌తో భారతదేశం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, సంతకాలు జరిగిన దాదాపు ఒక సంవత్సరం తర్వాత, జులై 15న అమల్లోకి రానుంది. ఈ మేరకు ఇరు దేశాల ప్రభుత్వాలు ప్రకటించాయి. భారతదేశం, ఒక యూరోపియన్ లేదా పాశ్చాత్య దేశంతో కుదుర్చుకున్న మొట్టమొదటి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అమలులోకి రానుంది. గత సంవత్సరం అమల్లోకి వచ్చిన యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందం, స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లిచెన్‌స్టైన్ అనే నాలుగు దేశాలతో కూడిన ఒక బహుళపక్ష సంస్థతో జరిగింది. జూలై 15న సీఈటీఏ, డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్‌లను ఏకకాలంలో అమలు చేయడం భారతదేశ ఎగుమతులకు గణనీయమైన కొత్త అవకాశాలను తెరుస్తుంది.

## నజ్రియా నజిమ్ వ్యాఖ్యలపై చర్చ..



**'అంటే సుందరానికీ' చిత్రంతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది మాలీవుడ్ బ్యూటీ నజ్రియా నజీమ్. తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నా.. తర్వాత అవకాశాలు రాలేదు. దీంతో సొంత పరిశ్రమకే పరిమితమైంది. అయితే ఈ అమ్మడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా నజ్రియా సోషల్ మీడియా వేదికగా పంచుకున్న ఓ పోస్ట్ నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇన్‌స్టా వేదికగా.. ఎద్దులు ఎరుపు రంగు జెండాల (రెడ్ ఫ్లాగ్స్) వెనుక పరిగెత్తడం పిచ్చితనం అని నేను ఒకప్పుడు అనుకునేదాన్ని అని.. కానీ ఇప్పుడు నేను కూడా అదే స్థితిలో ఉన్నాననే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ షేర్ చేశారు. నజ్రియా పోస్టును చూసి ఆమె ఏదైనా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారా లేదా తన జీవితంలోని కొన్ని నిర్ణయాల గురించి ఆత్మపరిశీలన చేసుకుంటున్నారా? అనే అనుమానాలు నెటిజన్లలో మొదలయ్యాయి. దీంతో ఈ పోస్ట్ వెనుక ఉన్న అసలు అంతరార్థం ఏమిటనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.**


–అక్షరటుడే, సినిమాడెస్క్

## 'రైతు బీమా' ఎగ్గొట్టడానికి కుట్ర: జీవన్‌రెడ్డి




**అక్షరటుడే, హైదరాబాద్:** రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది చనిపోయిన వారి కుటుంబాలకు రైతు బీమా డబ్బులు రాలేదన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులను కనుమరుగు చేస్తారని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం రైతుబీమా పథకం ఉందా లేదా అనే విషయం అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం బోనస్ ఇస్తామంటున్న 7 రకాల వడ్ల వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్లు నష్టపోతారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక యూరియా యాప్ అయితే నాకే అర్థం కాదు.. ఇక సాధారణ రైతులకు ఏం అర్థమవుతుంది అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.

## రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి




**అక్షరటుడే, మేడ్చల్/జనగామ:** తెలంగాణలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం నెల్లుట్ల రోడ్డు ప్రమాదం జరిగింది. దేవరుప్పుల మండలంలో జాట్ రోహిత్ కిరాణా దుకాణం నిర్వహిస్తాడు. మధు అనే వ్యక్తితో కలిసి రోహిత్ టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొని వస్తున్నాడు. అయితే నెల్లుట్ల సమీపంలోకి రాగానే వారి ట్రక్కు టైరు పంక్చర్ అయింది. దీంతో టైర్ మారుస్తుండగా.. మరో లారీ వీరిని ఢీకొట్టింది. దీంతో లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్ మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లిమురహరిపల్లి మధ్య కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. అనంతరం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

## ఆగి ఉన్న రైలులో డీజిల్ చోరీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** బీహార్‌లోని సీతామర్హి స్టేషన్‌లో ఆగి ఉన్న రైలు నుంచి ఓ వ్యక్తి దర్జాగా డీజిల్ చోరీ చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతోంది. పక్కనే ఉన్న రైలు ప్రయాణికులు ఈ దృశ్యాన్ని ఫోన్లలో చిత్రీకరిస్తున్నా, ఏమాత్రం భయం లేకుండా అతను తన పని పూర్తి చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రైలు ఆగి ఉన్నప్పుడు ఆ వ్యక్తి ఇంధనాన్ని తీస్తున్నట్లుగా ఆ ఫుటేజీలో కనిపిస్తోంది. ఈ వీడియో ఇంధన దొంగతనం, ప్రజా మౌలిక సదుపాయాల భద్రత, రైల్వే ప్రాంతాలలో నిఘా పెంచాల్సిన అవసరం గురించి చర్చకు దారి తీసింది. అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.